**Sakshi**

# 2011 గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష వాయిదా

## 13వ తేదీ జరగాల్సిన పరీక్ష 24న నిర్వహణ

**సాక్షి, హైదరాబాద్:** 2011 గ్రూప్-1 మెయిన్స్ తొలిరోజు పరీక్షను ఈనెల 13వ తేదీ నుంచి 24 నాటికి మార్చినట్లు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. పరీక్షలు ఈనెల 13 నుంచి ప్రారంభమై 23వ తేదీవరకు జరుగుతాయని ఏపీపీఎస్సీ ఇదివరకు ప్రకటించింది. అయితే బక్రీద్ పండుగను ఈనెల 12వ తేదీకి బదులు 13కు మార్చడంతో ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ తొలిరోజు పరీక్షను 13కు బదులు 24వ తేదీకి మార్చింది. విద్యార్థులు ఈ మార్పును గమనించాలని సూచించింది.

### పరీక్ష కేంద్రాలు దూరాభారం

హైదరాబాద్ కేంద్రంగా పరీక్షలు రాయాలనుకున్న వారికి కేటాయించిన సెంటర్లు దూరాభారంగా ఉన్నాయని ఆయా అభ్యర్థులు వాపోతున్నారు. ముఖ్యంగా గ్రూప్-1 పరీక్షల కోసం తెలంగాణ ప్రాంత జిల్లాల వారే కాకుండా ఏపీలోని పలు జిల్లాల నుంచి అభ్యర్థులు హైదరాబాద్‌లో ప్రత్యేక శిక్షణ కేంద్రాల్లో చేరారు. వీరంతా పరీక్షలను హైదరాబాద్ కేంద్రం నుంచి రాయడానికి ఆప్షన్ ఇచ్చారు. అయితే వీరికి కేటాయించిన కేంద్రాలు హైదరాబాద్ నుంచి 40 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉండడంతో తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. అయితే హైదరాబాద్‌ని ప్రభుత్వ విద్యాసంస్థలను కేంద్రాలుగా కేటాయించే అంశంపై తెలంగాణ ప్రభుత్వం నుంచి అనుమతుల విషయంలో ఇబ్బందులున్నందున ప్రైవేటు విద్యాసంస్థలను కేటాయించామని పేర్కొన్నాయి.